# "పెళ్లికూతురు"

"సుశీ" అన్నాడు సూర్యం. అందరూ అటువైపు చూశారు. సుశీల తలవంచుకుని అడిగిన ప్రశ్నకి సమాధానంగా అతని పాదాలకి వంగి నమస్కరించింది. రావు అటుచూడలేక ముఖం తిప్పుకున్నాడు."

రావుకి ఇద్దరే ఆడపిల్లలు. సుందరి, సుశీల ఇద్దరూ రెండేళ్ళు తేడాగా పెరిగి పెద్దవాళ్ళయినారు. పెద్ద పిల్లకి ఇరవై దాటుతున్నా పెళ్ళి ప్రయత్నం చెయ్యలేదని తల్లి రోజూ పోరుపెట్టడం పిల్లలు వింటూనేఉన్నారు. పిల్లలకి చదువులు చదివించి వాళ్ళ ఇష్ట ప్రకారం వాళ్ళకి నచ్చిన వాళ్ళని పెళ్ళిచెయ్యమని అడిగినప్పుడు చెయ్యాలని తండ్రి అభిప్రాయం. ఏలోటూలేని ఆ ఇంట్లో అక్క చెల్లెళ్ళు అన్నదమ్ముల్లాగా స్వేచ్ఛగా తమకి కావలసినట్టుగా పెరుగుతూ వస్తున్నారు.

అక్కచెల్లెళ్ళ అందచందాలు వర్ణించాలంటే ఎవరు ఎక్కువో చెప్పలేము. ఇద్దరూ తెలివి తేటల్లో కూడా సమఉజ్జీలుగా కవలల్లాగా పెరుగుతున్నారు.

"ఏమండీ! మిమ్మల్నే! సుందరిని చూడడానికని రత్నమ్మగారు వస్తున్నారు. పిల్లవాడు మంచి ఉద్యోగంలో ఉన్నాట్ట. బాగుంటాట్ట. బోలెడుఆస్తి. ఒక్కడే ఒక్కడు"

"ఊ అయిందా ఇంకో ఉందా!" అంటూ విసుగ్గా చదువుతూన్న పత్రిక చేతిలో ఉంచుకునే సమాధానం చెప్పాడు రావు.


"ఆడపిల్లలకి సంబంధాలు రావడమే కష్టంగా ఉంటే ఇంటిముందు వచ్చిన ఇంత మంచివాళ్ళని కాదంటే ఏమన్నా బాగుంటుందా? చెప్పండి మీరే?"

"నిన్ను ఈ అధిక ప్రసంగం ఎవరు చెయ్యమన్నారు? పిల్లలు పసిపాపలా? మనంవాళ్ళకి చూడనే అక్కరలేదు. ఇంక ఊరుకో!"

"బాగుందండీ వరస. వాళ్ళా చూసుకుంటారు? అంతా మీ ఇష్టాలే అన్నమాట. ఇంకనేను ఎందుకూ అంట?" అంటూ కన్నీళ్ళు ఆపుకుంటూ లోపలికి చక్కాపోయింది రావుగారిభార్య.

"పోనీనాన్నా! వచ్చిచూస్తే ఏంమునిగింది? అమ్మమాట కాదనడం బాగుంటుందా రమ్మందటగా. వచ్చిచూడనీ" అన్నది సుశీల, అక్క చెల్లెళ్ళ వాదనలు మాటకి మాట అన్నిముగిసి ఆఖరికి పెళ్ళివారు రావడానికి ఒప్పుకున్నారు అందుకే ఆతల్లి ఆనందపడి పోయింది.

పెళ్ళికొడుకూ, తల్లీ తండ్రీ అన్నట్లుగానే వచ్చారు. కావలసి పెళ్ళివారిని వెనక్కి పంపెయ్యాలని పెంకిపిల్లలు ఇద్దరూ వికారంగా కనపడాలని వెక్కిరిస్తూ కూచున్నారు. పరిచయాలు అయ్యాక రావుకి తెలిసింది. తనతో పాటు చదువుకున్న స్నేహితుడి అన్నకొడుకే అని, అందంగా ఉన్న ఆ పిల్లవాణ్ణి స్థితిమంతులైన పెద్దల్ని చూశాక రావు



రచయిత్రి శ్రీమతి కొమ్మూరి పద్మావతీదేవి.

కాస్త అటుమొగ్గాడు. పెళ్ళివారికి మర్యాదలు చేస్తూ అటూ ఇటూ ఖంగారుగా తిరిగింది రావుభార్య. పెళ్ళివారు లేచి వెళ్ళుతూ రెండురోజులలోనే కబురు చేస్తామన్నారు. వీధి గుమ్మందాకా అందరినీ సాగనంపి లోపలికి వస్తూ "నీకు ఇష్టమయితే మాత్రం మంచి సంబంధం" అన్నాడురావు సుందరిని చూసి నవ్వుతూ.

మేడమెట్లు ఎక్కుతూన్న సుశీల తండ్రిమాటలు వింటూ ఒక్క నిమిషం ఆగిపోయింది.

బియ్యంచాట చేతిలోనే ఉంచుకుని పెళ్ళివారి సంగతులన్నీ మళ్ళాచెప్పింది తల్లి. సుందరి మాట్లాడకుండా గది లోకి వెళ్ళిపోయింది.

"మీరే దానికినచ్చచెప్పండి. కట్నాలుఇస్తామని తిరుగుతున్నారుట. ఇంతకన్న మంచి సంబంధం ఇంకరాదు" అంటూ బియ్యంచాట అక్కడే మరిచి పరధ్యాన్నంగా వంటఇంటివైపు ఆలోచనగా వెళ్ళింది రావుభార్య.

ఆఫీసునించి అప్పుడే వచ్చినరావు కాఫికప్పు అందుకుంటూ "సుందరి నచ్చిందనీ, లగ్నం పెట్టమనీ కబురు పంపారు. ఏమనికబురుచెయ్యను? లేనిపోనిదేవచ్చిందే!"

"వాళ్ళిష్టం. వాళ్ళిష్టం, అంటున్నారు. ఇంతకన్న మంచిసంబంధం తెచ్చుకుంటారా, నామాటవిని, దాన్ని ఒప్పించి చేశెయ్యండి."

"ఊరుకోమ్మా! ఎవరికో ఒకరికిచ్చి తొందరగా పెళ్ళి చేశెయ్యాలంటావ్. నేనేంచేసుకోను!" అంటూ సుందరి తల్లిని కేకలువేస్తూ వెళ్ళిపోయింది.

ఈజీచెయిరులో పడుకున్నరావు చుట్టవెలిగించి భార్య మాటలు తలచుకొని ఆలోచనలో పడ్డాడు.

వచ్చిన మంచి సంబంధాన్ని వదులుకోలేక కొన్ని నెలలు గడువు కావాలని రావు అడగడం ఇంట్లో అందరికీ తెలిసింది.

"ఎందుకు నాన్నా! బొమ్మనక నానుస్తున్నావు"

"అలాతీసివేశే సంబంధం కాదమ్మా! బాగాఆలోచించుకో. తొందరేంలేదు"

"అదేమిటినాన్నా చదువు పూర్తి అయితేనేగాని పెళ్ళి సంగతే నేను ఆలోచించను"

"చదివి మాత్రం ఏంచెయ్యాలని! అయినా నీ ఇష్టం. నాకు మాత్రం ఈ సంబంధం ఎంతో నచ్చింది" అంటూ ఆఫీసుకి వెళుతూన్న తండ్రిని చూసి ఆశ్చర్య పడుతూ "సుశీ, నాన్న ఎందుకో ఇలా అయిపోయాడు. అమ్మ మాట వింటున్నాడు" అంటో దిగులుగా చెప్పుకుంది చెల్లెలికి. సుశీల ఏం మాట్లాడకుండా నవ్వుతూ వెళ్ళిపోవడం సుందరికి మరీ కోపంవచ్చింది.

"ఏమండీ విన్నారా? సుశీలసంగతి, మీకేం తెలియదు ఇంటి గొడవలు."

"ఏవిటే నీగోల?"

"అదే ఆగోలే చెబుతున్నాను. ఆ నీలకంఠంగారి అబ్బాయి సుశీలతో చదువుతున్నాట్టగా, ఇద్దరూ కలిసి తెగ తిరుగు తున్నారుట. నిన్నరాత్రి ఆలస్యంగా ఇంటికి వచ్చిందే ఆ అబ్బాయితో సినిమాకు వెళ్ళిందట. ఏమిటా స్వేచ్ఛ, ఈ తిరగడాలున్నూ!"

"అబ్బబ్బ! అన్నీనీకు గోలలే. వెళితే తప్పేం?"

"తప్పేంలేదు. నిన్న నేను పేరంటానికి వెళితే నీలకంఠంగారిభార్య ఈ ప్రస్తావనతెచ్చి వెక్కిరిస్తూచెప్పింది. సిగ్గుపడి తలవంచేసుకుని ఇంటికి వచ్చాను. మీకేం తెలియదు కదా!"

ఇంతవరకూ భార్య మాటల్ని విసుగ్గా వింటూన్న రావు ముఖం చిరాగ్గాపెట్టి "సుశీ" అంటూ గట్టిగా పిలిచాడు కోపంగా. తండ్రికేక వినగానే భయపడి పోతూ మెల్లిగా వచ్చి తలుపు ఓరగా నిలబడింది సుశీల.

"అమ్మ చెప్పినదంతా నిజమేనా? రాత్రిళ్ళుఎవరితోనో సినిమాకు వెళుతున్నావా? నిజమేనా?" ఎన్నడూ పల్లెత్తు మాట అనని తండ్రి కోపంగా అడిగేసరికి సుశీల వణికిపోయింది.

"వెళ్ళాను నాన్నా? అతను నాక్లాస్‌మేటు"

"అయితే? ఒక్కదానివి అలా వెళ్ళడం ఎంత అవమర్యాద! ఫలానావారి అమ్మాయి అన్నాక ఇంక మర్యాద ఎలా వస్తుంది?" అంటూ తండ్రి మరీ గద్దించగానే సుశీల ముఖం ఎర్రబడింది. తలవంచుకుంది చీరెకొంగు సవరించుకుంటూ.

"పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించు కున్నాం. అతనూ నేనూ, అక్కయ్య పెళ్ళితో కలిపి చేశెయ్య." అంటూ గిరుక్కున తిరిగి సిగ్గుతో భయంతో మేడమీదకి వెళ్ళిపోయింది. రావు సుశీల మాటలు విని నిర్ఘాంతపోయి ఒక అడుగు ముందుకువేసి తువాలుతో ముఖం తుడుచుకుంటూ పచార్లు చేస్తూ ఉండగ్గా—

"ఇప్పుడైనా తెలిసిందా!" అంటూ గర్వంగా రావు ముందు నిలబడి నవ్వింది భార్య.

"మొత్తానికి గట్టివానివే, ఇద్దరికీ ఒకేసారి చేశొద్దాము. జాతకాలు ఇలా ఇయ్య," అంటూ భర్త అనగానే భార్య ఆనందంతో ఉప్పొంగింది.

"సుశీ! వాళ్లని కనుక్కున్నాను. అతను అమెరికా వెళతాడట, నాలుగేళ్లకి గాని రాడట, అందాకా పెళ్లి చెయ్యము అని అన్నారు. నీకేమన్నా తెలుసా?"

"అతన్ని అడిగావా నాన్నా"

తల్లితండ్రుల ఇష్టం అన్నాడు. ఇంతే తేలింది ఏంచెయ్యాలో మీ అమ్మనే అడుగుదాం పిలు!"

"ఏంచెయ్యా లేమిటండీ. ప్రధానం చేసి తాంబూలాలు పుచ్చుకోండీ సుందరికిమాత్రం ఆలగ్నానికి పెళ్లిచేశొద్దాం"

"తల్లి మాటలు విని తండ్రి ఆనందించడం చూసి సుందరికి అమిత చిరాకు వేసింది. తల్లిని తిడుతూ అక్కడి నించి వెళ్లి పోయింది.

పెళ్లి పందిలితో, ఇల్లంతా బంధువులతో రావు ఇల్లు సందడిగా ఉంది. పెళ్లి కూతురికి కొన్న నగలూ, చీరెలూ, రావు భార్య అందరికీ చూపిస్తూంది.

పందిలి ముందు బాండు వాయిస్తున్నారు. పట్టు చీరెలతో పేరంటాళ్లు అటు ఇటు పళ్లాలతో హడావిడిగా తిరుగుతున్నారు. పెళ్లివారు వస్తున్నా రన్నారు ఎవరో. పెళ్లికి వచ్చే వారంతా గుంపులు గుంపులుగా పందిట్లో చేరుకుంటున్నారు. పురోహితులు అరుస్తూ అవీ ఇవీ కావాలని హడావిడి చేస్తూ ఉండగా పెళ్లి కొడుకు ఊరేగుతూ వాకిలి ముందుకి వచ్చాడు. జరగ వలసిన తంతు అంతా ముగిసి, హారతి ఇచ్చి, లోపలికి పిలుచుకు వచ్చి కూచోపెట్టారు. ఘరానా కుటుంబానికి చెందిన వియ్యాల వారిని వారి తరపు వారిని ఆప్యాయంగా పలక రిస్తూ మర్యాదలు చేస్తూ తిరుగుతున్నాడు రావు. ఇంతలో అతని చెవిలో వేసిన కబురు విని తొందరగా మేడ మీది గదికి పరుగెత్తాడు.

"ఏమైనా సరే, చంపినా సరే! అతన్ని చేసుకోను నాకీ పెళ్లేవద్దు" అంటూ ఒకటే ఏడుస్తున్న సుందరినీ. సుందరిని ఓదారుస్తున్న భార్యనీ చూసి తెల్లపోయాడు. కూతురి ఏడుపు చూసి తండ్రి గుండెలు గతుక్కు మన్నాయి. అవతల వాయిద్యాలు, పెళ్లివారు, పురోహితులు. అతని తల తిరిగి పోయింది. అతని ముఖంలోని ఆదుర్దా ఆరాటం చూసి అందరూ ఏమయిపోతాడో అనుకున్నారు. తలమీద చెయ్యి పెట్టుకుని కూచున్న తండ్రి దగ్గిరకి సుశీల వచ్చింది. తండ్రి బుజంమీద చెయ్యివేసి మెల్లిగా.

"నాన్నా! నన్ను తీసికెళ్లండి, నేచేసుకుంటాను, నలుగురిలో అవమానం కావద్దు" అంటూ తండ్రి చెవి దగ్గరగా చేరి చెప్పి సమాధాన పరిచింది. సుశీలని దగ్గిరగా తీసుకుని తలమీద చెయ్యివేసి కన్నీళ్లతో "సిద్ధంగా ఉండు తల్లీ" అంటూ కాళ్లు తడబడుతూ, ఆయాస పడుతూ కిందికి వెళ్లి పోయాడు.

"మావయ్యా! నాన్నవెంట ఉండు. నాన్న ఎలాగో అయిపోతున్నాడు" అంటూ సుశీల కన్నీళ్లు నించింది.

పెళ్లి కూతురు తల్లివెంట రావడం అందరూ వింతగా చూశారు. కొందరు గుసగుస లాడారు. వియ్యంకుడు తెల్లబోతూ లేవ బోయ్యాడు. వియ్యపు రాలు కొంగు సరి చేసుకుంటూ కోపంగా లేచి నిలబడింది నలుగురిలో నాలుగూ అడగాలనే కోపంతో. పెళ్లి కొడుకు తండ్రిని చూసి దగ్గరగా రమ్మని ఏదో చెప్పాడు. అంతా సద్దుమణి గింది. వాయిద్యాల సందడిలో అందరూ అరుస్తున్న అరుపులలో సుశీల మెడలో మంగళ సూత్రం కట్టాడు పెళ్లి కొడుకు. అక్షింతలు అంతా ఒక్క సారిగా చల్లారు. "ఆనంద మానంద మాయెనే" అంటూ సన్నాయి పాట అందరి చెవుల్లో ఒక్క సారిగా మోగింది. వధూవరులు పెద్దలందరికి నమస్కరిస్తూ అందరి దీవెనలూ అందు కుంటున్నారు.

"సుశీ!" అన్నాడు సూర్యం. అందరూ అటువైపు చూశారు. సుశీల తల వంచుకుని అడిగిన ప్రశ్నకి సమాధానంగా అతని పాదాలకి వంగి నమస్కరించింది. రావు అటు చూడలేక ముఖం తిప్పు కున్నాడు.

తండ్రి అవమానానికి తల వంచిన సుశీల గుండెలు కొట్టుకుంటూ ఉండగా, దడదడ లాడి ఊగిపోతూ ఉండగా పక్కనే ఉన్న పెళ్లి కొడుకు గట్టిగా పట్టు కున్నాడు. సరదా గల పెళ్లివారు హాస్యంచేస్తూ నవ్వారు. సూర్యం వెనక్కితిరిగి వెళ్లిపోవడం సుశీల కన్నీళ్లతో చూసింది. అతని బూడ్సుల చప్పుడుకి ఆమె గుండెలు అదిరి పోయాయి. పందిలంతా చిన్న బోయినట్లయింది సుశీలకి తనజీవితంలోని ఆనందాన్ని ఆశలని అన్నింటిని అతను తీసుకు వెళుతున్న ట్లయి నిర్జీవంగా నిలబడింది.

"సుశీ!" అంటూ తల్లి పెళ్లి కూతుర్ని లోపలకి పిలుచుకుని వెళ్లింది.

★